నమస్తే తెలంగాణ
కామారెడ్డి
3 | నిజామాబాద్, గురువారం 2 మే 2024 | KAMAREDDY

జాతీయ పార్టీలకు ఓటుతో బుద్ధి చెప్పాలి

మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల

ముప్కాల్ మండలం రెంజర్లలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్/ముప్కాల్, మే 1: ఎంపీ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను గెలిపించాలని కోరుతూ బుధవారం వేల్పూర్ మండలం మోతె, అక్లూర్, ముప్కాల్ మండలంలోని కొత్తపల్లి, రెంజర్ల గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించి మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెలలు గడుస్తున్నా అమలు చేయడం లేదని మండిపడ్డారు. ఎన్నికల ప్రచారానికి గ్రామానికి వచ్చే కాంగ్రెస్ నాయకులను ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు. ఒకవైపు తీవ్రమైన విద్యుత్ కోతలు, మరోవైపు తాగునీటి ఎద్దడితో గ్రామాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, మున్ముందు మరిన్ని సమస్యలు తప్పవని అన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంతో ఉన్నప్పటికీ మొన్నటి వరకు ఆపార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో చేసిందేమీ లేదని అన్నారు. ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని గెలిపిస్తే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామన్నారు. పసుపు బోర్డు ఏర్పాటైందని ఎంపీ అర్వింద్ చెబుతున్నాడని, అది ఎక్కడుందో చూపాలని వేముల ప్రశ్నించారు. రాజకీయ లబ్ధి కోసమే బీజేపీ నాయకులు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. గత ఎన్నికల్లో రైతులను మోసం చేసి ఎంపీగా గెలిచిన అర్వింద్‌కు ఈ ఎన్నికల్లో రైతులు బుద్ధి చెబుతారన్నారు. ఎంపీగా అర్వింద్ నియోజకవర్గంలో ఏ ఒక్క గ్రామం లోనూ ఇప్పటివరకు పర్యటించలేదన్నారు. కాంగ్రెస్, బీజేపీ ఇచ్చిన హామీలు అమలు చేయాలంటే ప్రజల పక్షాన పోరాడే బీఆర్ఎస్‌ను గెలిపించాలన్నారు.

జిల్లాకు అదనంగా బ్యాలెట్ యూనిట్లు

నిజామాబాద్ కలెక్టర్ పర్యవేక్షణలో మొదటి దశ పరిశీలన

ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

కంఠేశ్వర్, మే 1 : పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు అవసరమైన అదనపు బ్యాలెట్ యూనిట్లు జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోడౌన్‌కు బుధవారం చేరుకున్నాయి. ఈ మేరకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జిల్లా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు పర్యవేక్షణలో బ్యాలెట్ యూనిట్లను ఈవీఎం గోడౌన్‌లో భద్రపర్చారు. కలెక్టర్ ఆధ్వర్యంలో ఈసీఐఎల్ ఇంజినీర్లు బ్యాలెట్ యూనిట్లకు మొదటిదశ పరిశీలన చేపట్టారు. నిజామాబాద్ నియోజకవర్గ స్థానం నుంచి 29 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నందున పోలింగ్ నిర్వహణ కోసం రెండు బ్యాలెట్ యూనిట్లు ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. నిజామాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్‌కు ఎన్నికల సంఘం హైదరాబాద్‌లోని ఈసీఐఎల్ నుంచి అదనంగా వెయ్యి బ్యాలెట్ యూనిట్లను కేటాయించింది. ర్యాండమైజేషన్ నిర్వహించిన తర్వాత బ్యాలెట్ యూనిట్లను పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని ఆయా అసెంబ్లీ నియోజకవర్గాలకు తరలించేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ మకరంద్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, సాత్విక్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



నిప్పుల కొలిమి

- నిజామాబాద్ జిల్లాలో రికార్డుస్థాయి ఉష్ణోగ్రతలు
- ఎండ తాపానికి జనం ఇబ్బందులు
- వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ

ఖలీల్‌వాడి, మే 1: భానుడి భగభగతో ఈ ఏడాది రికార్డుస్థాయి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సూర్య ప్రతాపానికి నిజామాబాద్ జిల్లా నిప్పుల కొలిమిలా మారింది. ఎండ తాపాన్ని ప్రజలు తట్టుకోలేకపోతున్నారు. వేడి గాలులు, ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఉదయం 11 దాటిందంటే జనం బయటికి వెళ్లాలంటే జంకుతున్నారు. దీంతో మధ్యాహ్నం రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి.

ఇందూరు @ 44.1

వాతావరణం పూర్తిగా పొడిగా మారింది. గతేడాదికన్నా నిజామాబాద్ జిల్లాలో రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. బుధవారం ఏకంగా 44.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతగా రికార్డయ్యింది. ఉదయం 8 గంటల నుంచే ఉక్కపోత మొదలుకావడంతో ఇందూరు వాసులు చెమటలు కక్కుతున్నారు. ఎండలకు తోడు వడగాలులు సైతం ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. దీంతో దినసరి కూలీలు, రైతులు, వివిధ రంగాల కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లాలో వడదెబ్బ మరణాలు సైతం చోటుచేసుకోవడం ఆందోళనకు గురిచేస్తున్నది. రాత్రిపూట కూడా వాతావరణం వేడిగానే ఉంటున్నది. దీంతో కూలర్ల చల్లదనం కూడా సరిపోవడంలేదు. కంటిమీద కునుకు రావడంలేదు.

కనిపించని ఎన్నికల సందడి..

ఎండల తీవ్రతకు జనం బయటికి రావాలంటే భయపడుతున్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారం ఊపందుకున్నప్పటికీ దంచి కొడుతున్న ఎండలతో సందడి కనిపించడం లేదు. అభ్యర్థులతో పాటు ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు ఉదయం, సాయంత్రం పూటనే ప్రచారం చేసేందుకు బయటికి వస్తున్నారు. రోడ్‌షోలు, ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నప్పటికీ ఎండల కారణంగా షెడ్యూల్‌లో మార్పు చేసుకుంటున్నారు. కొన్ని పార్టీల ప్రచారానికి జనం లేక కార్యక్రమాలు వెలవెలబోతున్నాయి.

జాగ్రత్తలు తప్పనిసరి..

ఎండలు దంచి కొడుతుండడంతో జిల్లా వైద్యారోగ్య శాఖ అప్రమత్తమైంది. జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నది. ఆరోగ్య కేంద్రాలతోపాటు బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ఉపాధి పనులు చేపట్టిన ప్రాంతాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుతున్నారు. వేసవి తాపాన్ని తట్టుకునేందుకు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. వడదెబ్బ బారిన పడకుండా ప్రతిరోజూ 4 నుంచి 5 లీటర్ల నీళ్లు తాగాలని సూచిస్తున్నారు. బయటికి వెళ్తే ఎక్కువగా నీడపట్టున ఉండాలని, శరీరం పూర్తిగా కప్పి ఉంచేలా దుస్తులు, గొడుగు లేదా తలకు టోపీ ధరించాలన్నారు.

జిల్లాకు ఆరెంజ్ అలర్ట్..

ఎండల తీవ్రత కారణంగా వాతావరణ శాఖ నిజామాబాద్ జిల్లాకు ఆరెంజ్ అలర్ట్ జారీచేసింది. వేడిమితోపాటు వడగాలుల ప్రభావం ఉంటుందని, ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బయటికి రావొద్దని హెచ్చరించింది. అత్యవసరమైతే తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని సూచించింది. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశముందని అధికారులు తెలిపారు. దీంతో జిల్లావాసులు బెంబేలెత్తుతున్నారు.

అత్యవసరమైతేనే బయటికి రావాలి..

అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో వాతావరణశాఖ జిల్లాకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి. అవసరమైతేనే బయటికి రావాలి. వడదెబ్బ తగిలిన వారికి వెంటనే ప్రథమ చికిత్స అందించేలా అన్ని ఏర్పాట్లు చేశాం.

-సుదర్శనం,
డీఎంహెచ్‌వో, నిజామాబాద్

బోధన్ ప్రచార సభలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

సుదర్శన్‌రెడ్డి నిరంకుశత్వానికి బుద్ధి చెప్పాలి

- షకీల్ ఉంటే కాంగ్రెస్‌కు ఓట్లు రావనే భయంతోనే పోలీస్ కేసులు పెడుతున్నారు..
- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

బోధన్/బోధన్ రూరల్, మే 1: తాను హోంశాఖ మంత్రిని అవుతానంటూ పోలీసులు, అధికారులపై ఒత్తిడి తెస్తూ.. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను వేధింపులకు గురిచేస్తున్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి నిరంకుత్వానికి పార్లమెంట్ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని బీఆర్ఎస్ నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ పిలుపునిచ్చారు. పట్టణంలోని రమాకాంత్ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. షకీల్ స్థానికంగా ఉంటే బీఆర్ఎస్‌కు ఎక్కువ ఓట్లు వస్తాయన్న భయంతో ఇక్కడికి రాకుండా ఆయనతోపాటు ఆయన కొడుకుపై అక్రమ కేసులు పెట్టారని ఆవేదన వ్యక్తంచేశారు. మాజీ మంత్రి డి.శ్రీనివాస్‌కు స్నేహితులుగా ఉన్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి కలిసి ఐదేండ్ల క్రితం ఎంపీ ఎన్నికల్లో కవితను ఓడించేందుకు బీజేపీకి ఓట్లు వేయించారని, ఈ ఇద్దరూ ఇప్పుడు సెక్యులర్ అని చెప్పుకోవడం సిగ్గుచేటని బాజిరెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి నిజాం షుగర్ ఫ్యాక్టరీపై ఎంత మాత్రం ప్రేమలేదని, 2004 నుంచి ఆ పార్టీ నిజాం షుగర్స్‌ను తెరిపిస్తామంటూ ఎన్నికల్లో హామీలు ఇస్తూ ప్రజలను మోసంచేసిందని బాజిరెడ్డి గోవర్ధన్ విమర్శించారు. ఓట్ల కోసం మరోసారి కాంగ్రెస్, బీజేపీ పార్టీలు నిజాం షుగర్స్ తెరిపిస్తామంటూ బూటకపు హామీలు ఇస్తున్నాయన్నారు. నిజామాబాద్‌కు వచ్చిన ప్రధాని మోదీ పసుపు బోర్డును ఇస్తున్నామని హడావిడి చేశారని, పసుపు బోర్డు ఎటుపోయిందని ప్రశ్నించారు. తాను ఎంపీగా గెలిచిన వెంటనే బోధన్ – బీదర్ రైల్వేలైన్ నిర్మాణం జరిగేలా కృషిచేస్తానని బాజిరెడ్డి గోవర్ధన్ హామీ ఇచ్చారు. రాయలసీమ ఎక్స్‌ప్రెస్ బోధన్‌కు నడిచేలా, గతంలో ఉన్న బోధన్–మిర్జాపల్లికి ప్యాసింజర్ రైలును పునరుద్ధరించేలా కృషి చేస్తానన్నారు. ఏజెంట్ల చేతిలో మోసపోతున్న యువత కోసం తాను గల్ఫ్ పాలసీని తీసుకువచ్చేందుకు పోరాడుతానన్నారు.

మరోసారి మోసపోవద్దు..

బోధన్ మండలంలోని పెగడాపల్లి గ్రామంలో బాజిరెడ్డి గోవర్ధన్ ఎన్నికల ప్రచారం, కార్నర్ మీటింగ్ నిర్వహించి మాట్లాడారు. కాంగ్రెస్ సర్కారు చర్యలు రైతులను కంటతడి పెట్టిస్తున్నాయన్నారు. కేవలం అధికార దాహంతోనే ఆరు గ్యారెంటీల పేరిట ఆశజూపి ప్రజలను నిండాముంచిందని ఆరోపించారు. రైతులతోపాటు అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్‌పై ఆగ్రహంతో ఉన్నారని అన్నారు. మరోసారి కాంగ్రెస్‌పార్టీకి ఓటు వేసి కష్టాలు కొనితెచ్చుకోవద్దని కోరారు. బీజేపీ ఒక మతతత్వ పార్టీ అని, దేవుళ్ల పేరుతో ఆ పార్టీ నాయకులు నీచ రాజకీయాలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. తాను విజయం సాధిస్తే పెగడాపల్లి గ్రామంలో జాతీయ బ్యాంకును ఏర్పాటు చేయిస్తానన్నారు.

కాంగ్రెస్ బూటకపు హామీలతో మోసం చేసింది..

బోధన్ మాజీ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ సతీమణి ఆయేషా ఫాతిమా మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ 420 హామీలతో మోసం చేసి అధికారంలోకి వచ్చిందని, ఈ ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలన్నారు. ముస్లిం పిల్లలు బాగా చదువుకుంటున్నారంటే కేసీఆర్ సర్కారు ఏర్పాటుచేసిన మైనార్టీ గురుకులాలే కారణమన్నారు. పోరాటాన కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి గెలిస్తే ఆయన కోసం జగిత్యాలకు వెళ్లాల్సివస్తుందని మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్ అన్నారు. బాజిరెడ్డి గోవర్ధన్ ప్రజల గొంతుక అని, ఇక్కడి సమస్యలు కేంద్రం వద్ద వినిపించాలంటే బాజిరెడ్డిని పార్లమెంట్‌కు పంపాల్సిన అవసరముందని జడ్పీ చైర్మన్, బీఆర్ఎస్ బోధన్ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి దాదన్నగారి విఠల్‌రావు అన్నారు.

సభకు హాజరైన పట్టణ ప్రజలు

దొంగ మాటలు చెప్పేవారికి కర్రుకాల్చి వాత పెట్టండి

- పాలిచ్చే బర్రెను దూరం చేసుకొని గొడ్డు బర్రెను తెచ్చుకోవద్దు
- బీబీ పాటిల్, సురేశ్‌షెట్కార్ ప్రజలకు చేసిందేమీ లేదు
- ఎన్నికల ప్రచారంలో మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి

బీఆర్ఎస్ ప్రచార రథానికి ఆహ్వానం పలికేందుకు బోనాలతో పెద్ద సంఖ్యలో తరలివచ్చిన మహిళలు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి. ప్రచార రథంపై బీఆర్ఎస్ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్

దోమకొండ, మే 1: పదేండ్ల పాలనలో కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని, అవన్నీ ప్రస్తుతం మన కండ్ల ముందున్నాయని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం చేపట్టిన కాంగ్రెస్.. ఒక్క హామీని కూడా అమలు చేయలేదన్నారు. పాలిచ్చే బర్రెను దూరం చేసుకొని దొడ్డుగా ఉన్నదని గొడ్డు బర్రెను తెచ్చుకోవద్దని ప్రజలను కోరారు. కాంగ్రెస్, బీజేపీలు అనేక హామీలిచ్చి మోసం చేశాయని, మరోసారి దొంగ మాటలు చెప్పకుండా కర్రుకాల్చి వాతపెట్టాలని పిలుపునిచ్చారు. కామారెడ్డి జిల్లా దోమకొండ మండల కేంద్రంలో జహీరాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్‌తో కలిసి బుధవారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన గ్యారెంటీలు, హామీలను గుర్తు చేస్తూ.. ఐదు నెలల గడిచినా ఎందుకు అమలు చేయలేదన్నారు. వారి చెప్పిన ఒక్క పథకమైనా వచ్చిందా అంటూ ప్రజలను ప్రశ్నించారు. రైతుబంధు పథకం మంత్రి తుమ్మల నాగేశ్వరావుకే రాలేదని, ఇక రైతులకేమిస్తారని ఎద్దేవా చేశారు. పేద, ముసలి, ముతక, యువతతో పాటు అన్ని వర్గాల వారిని కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. పదేండ్ల క్రితం ముఖ్యమంత్రిగా పదవి చేపట్టిన కేసీఆర్.. తాను ముందే చెప్పినట్లు.. రాష్ట్ర అభివృద్ధితోపాటు అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి అనేక కార్యక్రమాలు అమలు చేశారని తెలిపారు. అప్పుడే ప్రధానిగా గద్దెనెక్కిన మోదీ.. దేశానికి, ప్రజలకు ఏమీ చేయలేదని, కేవలం అదానీ, అంబానీలకే సంపదనంతా పంచిపెట్టారని అన్నారు. పార్లమెంటు నియోజకవర్గాల వారీగా జిల్లాలను ఏర్పాటు చేస్తామంటున్నారని, అలా చేస్తే కామారెడ్డి జిల్లా ప్రజలు ఇకనుంచి జహీరాబాద్‌కు పోవాల్సి వస్తుందన్నారు. బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్, కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్ షెట్కార్‌కి కొత్త ముఖాలు కావని, వారు గత 15 ఏండ్లలో ఒక్క మంచి పని కూడా చేయలేదని గుర్తుచేశారు. కామారెడ్డిని ఎంతో అభివృద్ధి చేసిన గంప గోవర్ధన్‌ను చూసి.. బీసీ బిడ్డ గాలి అనిల్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్, జడ్పీ వైస్ చైర్మన్ పరికి ప్రేమ్‌కుమార్ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

జనాన్ని నమ్మించేందుకే దేవుళ్లపై ఒట్లు వేస్తున్నారు

మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్

అసెంబీ ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క హామీ కూడా నెరవేర్చకపోవడంతో కాంగ్రెస్ పార్టీపై విశ్వాసం పోయిందని, అందుకే రేవంత్‌రెడ్డి ప్రజలను నమ్మించేందుకు దేవుళ్లపై ఒట్లు వేస్తున్నాడని కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ అన్నారు. కేసీఆర్ నాయకత్వంలో కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను పదేండ్లలో ఎలా అభివృద్ధి చేసుకున్నామో ఆలోచన చేయాలన్నారు. పంద్రాగస్టు వరకు రైతు రుణమాఫీ చేస్తామని మరో కొత్త నాటకం ఆడుతున్నారని, సిగ్గులేకుండా ఒట్లు కూడా వేస్తున్నారని మండిపడ్డారు. ఈ ఎలక్షన్ కాగానే రుణమాఫీని పక్కన పడేయవచ్చని కాంగ్రెస్ నాయకులు ఆలోచిస్తున్నారని అన్నారు. వారి మాటలను అసలే నమ్మొద్దన్నారు.